క్లుప్తంగా

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైన చెక్కును ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్ కుమార్ సోమవారం అందజేశారు. నగర పంచాయతీ 12 వార్డు కౌన్సిలర్ బీమువరపు విజయదుర్గారావు గతేడాది ప్రమాద వశాత్తు మృతి చెందాడు. ఆ బాధిత కుటుంబానికి సీఎం సహాయ నిధి నుంచి రూ.5 లక్షల మంజూరు య్యాయి. ఈ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, వేగిరౌతు రాజబాబు, వైస్ చైర్మన్ బోసురాజు, చెల్లుబోయిన శ్రీనివాసరావు, టౌన్ కన్వీనర్ బొంతు సత్యశ్రీనివాస్, ఎస్.రామకృష్ణంరాజు తదితరులున్నారు.

3న మెగా జాబ్ మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్ల, జేసీ ధ్యాన్‌చంద్ర తదితరులు

అమలాపురం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఉపాధి శిక్షణ శాఖ సీడప్ ఆధ్వర్యంలో కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గంలో వచ్చే నెల 3వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహించనున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జేసీ ధ్యాన్‌చంద్ర, డీఆర్వో సత్తిబాబు, పీడీ డీఆర్‌డీఏ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఇరవాడ వసంత లక్ష్మి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.లోకమాన్ మెగా జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ జాబ్ మేళాకు 12 కంపెనీలు వస్తాయని, సుమారు 850 పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిపారు. వివరాల కోసం 9014861375, 9989910835 నంబర్లను సంప్రదించాలని అన్నారు.

విద్యుత్ బిల్లులు సకాలంలో చెల్లించాలి

యానాం: నియోజకవర్గ విద్యుత్ వినియోగదారులు తమ నెలవారీ విద్యుత్ బిల్లులను సకాలంలో చెల్లించాలని విద్యుత్ శాఖ ఏఈ లంక కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సకాలంలో చెల్లించని వినియోగదారుల సర్వీసులను తొలగిస్తారని, బిల్లులు చెల్లించిన వారం దరూ రసీదులను పొందాలని కోరారు. అదేవిధంగా విద్యుత్‌శాఖ అనుమతిలేకుండా హెచ్‌టీ, ఎల్‌టి స్తంభాలు మీదుగా వేసిన కేబుల్స్‌ను తక్షణం తొలగించాలని సూచించారు.

శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలని వినతి

ఉప్పలగుప్తం: గ్రామంలో ఉన్న శ్మశానవాటిక ఆక్రమణకు గురైందని పలువురు తహసీల్దార్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. గత కొంత కాలంగా శ్మశానవాటికను ఆక్రమించి కొబ్బరిమొక్కలను నాటి, పూరిగుడిసెలు నిర్మించారని గ్రామస్తులు తెలిపారు. వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మధుర ప్రతాప్, పండు చిరంజీవి, కుంచే రాజేష్, మొసలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: పదో తరగతి పరీక్షలకు సంబంధించి జిల్లా ప్రజా పరిషత్ రూపొందించిన జగనన్న విద్యా భారతి స్టడీ మెటీరియల్‌ను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్ టెన్త్ విద్యార్థులకు అందజేశారు. సోమవారం పటవల, కొత్తకోరంగి, చిన బొడ్డు వెంకటాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూళ్లలో జరిగిన కార్యక్రమాలలో వారు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమాల్లో నాయకులు కొప్పిశెట్టి వెంకట్, కాలా వెంకటరమణ, తణుకు సత్యనారాయణ, పోతుల రత్నకుమారి, కామాడి భైరవమూర్తి, హెచ్‌ఎంలు టి.కాశీ విశ్వనాథ్, కేఆర్‌కే సాయిప్రసాద్, ఎంపీడీఓ చింతా మోహన్ కృష్ణ, కోరంగి పంచాయతీ కార్యదర్శి రామరాజు, ఏఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

ఐ.పోలవరంలో...

ఐ.పోలవరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జెడ్పీటీసీ సభ్యులు ముదునూరి సతీష్‌రాజు, ఎంపీపీ మోర్త మిరియం జ్యోతి స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దంతులూరి వెంకట రాఘవరాజు, నాయకులు విత్తనాల శ్రీనివాస్, హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు, రేవు సారెడ్డి, జంపా సత్యన్నారాయణ, రాయపురెడ్డి బాబి తదితరులు పాల్గొన్నారు.

'పది'పై పట్టుకు 'ప్రణాళిక'

- పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- రోజూ అదనపు తరగతుల నిర్వహణ
- పిల్లల చదువుపై తల్లిదండ్రులకు కౌన్సెలింగ్
- జగనన్న విద్యాభారతి పేరుతో స్టడీ మెటీరియల్ అందజేత



పి.మల్లవరం హైస్కూల్‌లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లరేవు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ ప్రణాళిక అమలు చేస్తోంది. టెన్త్ పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారికి ప్రతిరోజూ అదనపు తరగతులు నిర్వహించి, మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. ముఖ్యంగా సిలబస్‌పై పట్టు సాధించి మంచి మార్కులు పొందేలా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నారు. విద్యార్థుల్లో పరీక్షలంటే భయం లేకుండా ఉండేందుకు ప్రతి రోజూ స్లిప్ టెస్ట్‌లు నిర్వహిస్తూ వారిలో అవగాహన కల్పిస్తూ ధైర్యాన్ని నింపుతున్నారు. దీనికి అటు ప్రభుత్వం నుంచి సహకారం ఇటు తల్లిదండ్రుల నుంచి ప్రోత్సాహం ఉండడంతో ప్రైవేటు స్కూల్స్ కంటే మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు. తమ పిల్లలను ఇంటి వద్ద కూడా చదివించాలని, వారికి ఆ మేరకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. దీంతో ఈ ఏడాది మంచి ఫలితాలు సాధిస్తామని అటు ఉపాధ్యాయులు ఇటు విద్యార్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్

టెన్త్ విద్యార్థులు సులువుగా ప్రిపేర్ అయ్యేలా ప్రభుత్వం స్టడీ మెటీరియల్‌ను అందజేస్తుంది. ఈ ఏడాది జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో విద్యార్థులందరికీ జగనన్న విద్యాభారతి పేరుతో స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నారు. ఇప్పటికే సిద్ధం చేసిన ఈ మెటీరియల్‌ను ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, స్థానిక సర్పంచ్‌ల చేతుల మీదుగా విద్యార్థులకు అందజేస్తున్నారు. ఈ ఏడాది తాళ్లరేవు మండలంలో మొత్తంగా 1299 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో 495 మంది బాలురు, 547 మంది బాలికలు కలిపి 1042 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కాగా, 148 మంది బాలురు, 109 మంది బాలికలు కలిపి 257 మంది ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ఉన్నారు.



పది విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఉపాధ్యాయులు

నూరు శాతం ఫలితాలే లక్ష్యం



టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. దీనికోసం పాఠశాల ముగిసిన తరువాత ప్రతి రోజూ సాయంత్రం నాలుగు నుంచి 5.30 గంటల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను చదివించడంతోపాటు వారికి ఉన్న సందేహాలను నివృత్తి చేస్తున్నాం. అన్ని సబ్జెక్టుల్లోనూ ప్రతిభ కనబరిచేలా ఒక టైం టేబుల్‌ను సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా ఉపాధ్యాయులచే ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. అంతేకాకుండా చదువులో వెనుకపడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టిసారించి వారికి ప్రతి సబ్జెక్టులోనూ ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు తర్ఫీదునిస్తున్నారు.

–మోకా ఉమ, ప్రధానోపాధ్యాయిని
జిల్లా పరిషత్ హైస్కూల్, పి.మల్లవరం

మారిన ప్రశ్నాపత్రాలపై అవగాహన



ప్రభుత్వం ఈ ఏడాది పరీక్షా విధానంలో కొన్ని మార్పులు తీసుకువచ్చింది. దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో ఒక్కొక్క సబ్జెక్టుకు రెండు పరీక్షలు నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి ఒక్కొక్క పరీక్షే రాయాల్సి ఉంటుంది. దానికి అనుగుణంగా తర్ఫీదునిస్తున్నాం. ముఖ్యంగా ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్ పరీక్షలు ఒకే రోజు రాయాలి. ఉదయం 9.30 గంటలకు పీఎస్ పరీక్ష, ఒక గంట తరువాత ఎన్ఎస్ పరీక్షను రాయాలి. ఇంగ్లీషు పేపర్ వరుస క్రమంలోనే రాయాలి. అన్నింటిపై అవగాహన కల్పిస్తున్నాం.

– నల్లం సత్యనారాయణమూర్తి,
ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు

నేడు లక్ష్మీనరసింహస్వామి గజమాల యాత్ర

అల్లవరం: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారికి సమర్పించనున్న గజమాలను అల్లవరం మండలం ఓడలరేవు గ్రామం నుంచి మంగళవారం ఉదయం ఏడు గంటలకు గజమాల యాత్ర ప్రారంభమవుతుందని రాజోలు తాలుకా అగ్నికుల క్షత్రియ యువజన సేవా సంఘం అధ్యక్షుడు చింతా మహానాగరాజు సోమవారం అల్లవరంలో తెలిపారు. ఓడలరేవులో ప్రారంభమైయ్యే గజమాల యాత్ర అల్లవరం, పేరూరు, రాజోలు మీదుగా లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయం వరకూ సాగుతుందని ఆయన తెలిపారు. పన్నెండేళ్లుగా గజమాల యాత్ర నిర్వహిస్తున్నామని, ఈ యాత్రలో తెలుగు రాష్ట్రాల నుంచి అగ్నికులక్షత్రియులు వేలాదిగా తరలివస్తారన్నారు. మంగళవారం జరగబోయే గజమాల యాత్రని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకట రామరాజు, యిల్లింగి వెంకటరమణ, శేరు శ్రీను, పెమ్మాడి సాయిబాబు, ధర్మ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ సెక్యూరిటీపై 'కార్యశాల'

అల్లవరం: ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ సేఫ్టీ, సెక్యూరిటీపై సోమవారం కార్యశాల నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి హైదారాబాద్‌కు చెందిన సైబర్ సెక్యూరిటీ నిపుణులు ఐఎల్ నరసింహరావు ముఖ్యఅతిథిగా హాజరై సైబర్ సేఫ్టీ అండ్ సెక్యూరిటీ అండర్ డిజిటల్ శక్తి 4.0 క్యాంపైన్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఇటీవల సైబర్ నేరాలు మహిళలను టార్కెట్ చేస్తూ ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. మహిళల్లో డిజిటల్ అక్షరాసత్య లేని కారణంగా సైబర్ దాడులు జరుగుతున్నాయని, మహిళలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. డేటా పైరసీ, సోషల్ మీడియా సేఫ్టీ, సైబర్ లా, సైబర్ క్రైం, సైబర్ విలువలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల డీన్ టీవీ జనార్దనరావు, కన్వీనర్ సీహెచ్ శ్రీదేవి, దేవబాలన్ పాల్గొన్నారు.

గ్యాస్ లీకై తాటాకిల్లు దగ్ధం

ఉప్పలగుప్తం: ఎస్.కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని రాఘవులపేటలో కర్రి వెంకటేశ్వరరావుకు చెందిన తాటాకిల్లు అగ్నికి కాలిబూడిదయ్యింది. సోమవారం ఉదయం వెంకటేశ్వరరావు భార్య వంట చేస్తుండగా గ్యాస్ లీకై మంటలు వ్యాపించాయి. మంటల్లో అన్ని కాలిపోయాయి. ముమ్మిడివరం నుంచి అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి వచ్చి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో రెండు సిలెండర్లు పేలుడుకు గురైయ్యాయని, అయితే ప్రాణ పాయం తప్పిందని బాధితులు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఐ.పోలవరం: ఎదురులంక పాతరేవు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు ముమ్మిడివరం పోలీసులు తెలిపారు. సుమారు 25 నుంచి 30 ఏళ్ల వయస్సు గల వ్యక్తి నీలం రంగు జీన్స్‌ప్యాంటు, ఎడమ చెవికి పోగు ఉన్నట్టు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఆ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు ఐ.పోలవరం పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

కుష్టు వ్యాధి నివారణపై అవగాహన

అమలాపురం రూరల్: ప్రపంచ కుష్టు వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కిమ్స్ హాస్పిటల్‌లో చర్మ వ్యాధి విభాగ వైద్య నిపుణులు కుష్టు వ్యాధిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆనంద్ ఆచార్య మాట్లాడుతూ కుష్టు వ్యాధిని గురించి, లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

వీరన్నబాబు ఆలయ వార్షికోత్సవం

అమలాపురం రూరల్: బండారులంక గ్రామంలో అర్లపల్లి నాగేశ్వరరావు ఇంటి వద్ద ఉన్న వీరన్నబాబు ఆలయం 72వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుక ఏటా మాఘమాసంలో జరుగుతుంది. సోమవారం గ్రామంలో స్వామివారిని ఊరేగించారు. ఉదయం నుంచి సాయంత్రం అన్నదానం కార్యక్రమం జరిగింది.

అంగన్‌వాడీ కేంద్రానికి స్థలం దానం

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి పంచాయితీ పరిధి వాడపద్రులో అంగన్‌వాడీ కేంద్ర భవన నిర్మాణానికి గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు చెన్నుబొట్ల రామలింగమూర్తి స్థలాన్ని దానంగా ఇచ్చారు. రామలింగమూర్తి చిన్న కుమారుడు సత్య వేణుగోపాలరావు జ్ఞాపకార్థం 3.75 సెంట్లు భూమి పత్రాలను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.అన్నపూర్ణకు ఆయన పెద్ద కుమారుడు వెంకట రమణమూర్తిలతో కలసి సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా స్థల దానం చేసిన తండ్రి, కుమారులను గొల్లవిల్లి పంచాయతీ కార్యాలయంలో గ్రామ ప్రజల సమక్షంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, అంగన్‌వాడీ కార్యకర్తలు దుశ్శాలువాలు కప్పి పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, సొసైటీ అధ్యక్షులు మారిశెట్టి పుండరీకాక్షుడు, సీఐటీయూ నాయకురాలు పి.బేబి గంగారత్నం, నాయకులు బడుగు అబ్బులు, వీరవల్లి చినబాబు, చప్పిడి దుర్గారావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

డ్రోన్‌లతో భూసర్వే ప్రారంభం



విలసవిల్లిలో డ్రోన్ ద్వారా సర్వే ప్రారంభిస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: జగనన్న భూసర్వే శాశ్వత భూహక్కు పథకం ద్వారా ప్రభుత్వం డ్రోన్ల ద్వారా చేపడుతున్న భూసర్వే విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో అధికంగా ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురై రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల చేతిలో చలామణి అవుతుందని అన్నారు. దీని కారణంగా గ్రామంలో జగనన్న కాలనీకి స్థలం చేకూర్చడానికి వీలు పడక పక్క గ్రామంలో అందించడంపై ప్రజలు నిరాకరించారని తెలిపారు. ఈ సర్వే ద్వారా ప్రభుత్వం స్థిరభూమిని గుర్తిస్తే విలసవిల్లిలో లబ్ధిదారులకు జగన్న ఇళ్ల పట్టాలను అందించడంతో పాటు గ్రామాల్లో భూ సమస్యలు తీరుతాయని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, తహసీల్దార్ జె.వెంకటేశ్వరి, ఎంపీడీవో కె.ఎస్.గౌరీకుమారి, రీసర్వే డీటీ జీవీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, గ్రామకమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, బళ్ల నాగసతీష్, కార్యదర్శి కృష్ణాజి, సర్వేయర్ శివ, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఒకటిన కాలభైరవ స్వామి తీర్థం



విలేకరులతో మాట్లాడుతున్న బొడ్డు సత్యనారాయణ

తాళ్లరేవు: మండలంలో ప్రసిద్ధి పొందిన కాలభైరవ స్వామి తీర్థ మహోత్సవాన్ని ఫిబ్రవరి ఒకటో తేదీన ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ నిర్వాహకులు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ కోరంగి పంచాయతీ సీతారామపురం సుబ్బారాయుని దిమ్మ సెంటర్ ప్రాంతంలో ప్రతిష్ఠితమైన కాలభైరవ స్వామివారి తీర్థం ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన వైభవంగా నిర్వహిస్తామన్నారు. ఏడు గ్రామాల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ తీర్థ మహోత్సవానికి జిల్లా వ్యాప్తంగా వేలాది మంది ప్రజలు స్వామి వారిని దర్శించుకుంటారని తెలిపారు. ఈ సందర్భంగా గణేష్ చేపల వర్తక సంఘం ఆధ్వర్యంలో అదే రోజు భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ ఏడాది మహోత్సవాలను భారీ ఎత్తున నిర్వహించడానికి అన్ని గ్రామాల పెద్దలు చర్చించి నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ సభ్యులు పెస్సంగి ఈశ్వరరావు, గాడిమొగ, పెదవలసల, లక్ష్మీపతి పురం, చినవలసల, చినబొడ్డు, పెదబొడ్డు వెంకటాయపాలెం, సీతారామపురం యాదవ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

పంది మాంసం అమ్మకాలు ఆపాలి

పందుల పెంపకందారులకు నోటీసులు



అమలాపురం మార్కెట్ ఏరియాలో పందుల వైరస్‌పై ఆటో ద్వారా ప్రచారం చేస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్: పట్టణం, పరిసర గ్రామాల్లో పందులకు వైరస్‌తో చనిపోతున్న క్రమంలో పంది మాంసం అమ్మకాలను నిషేధించారు. పంది మాంసం అమ్మకాలను వెంటనే నిలిపివేయాలని పందుల పెంపకందారులకు పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయారెడ్డి సూచించారు. ఆయన పట్టణంతోపాటు రూరల్ మండలం సవర్పాలెం, సమనస తదితర గ్రామాల్లో పర్యటించి పందులకు వస్తున్న వైరస్‌పై అవగాహన కల్పించారు. సవర్పాలెం గ్రామంలో పది మంది పందుల పెంపకందారులకు మాంసం అమ్మకాలను నిలిపివేయాలని సూచిస్తూ నోటీసులు జారీ చేశారు. వైరస్ నుంచి పందులను కాపాడేందుకు ఇవ్వనున్న రింగ్ వ్యాక్సిన్లు కాకినాడ నుంచి అమలాపురానికి సోమవారం సాయంత్రానికి వస్తాయని సహాయ సంచాలకులు డాక్టర్ విజయారెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో పందులకు వ్యాక్సిన్ వేయనున్నట్టు తెలిపారు. పందులు తుప్పల్లో లేదా డ్రెయిన్లలో చనిపోయిన సమాచారాన్ని ప్రజలు కూడా తక్షణమే మున్సిపాలిటీకి అందించాలన్నారు. వైరస్‌పై జాగ్రత్తలను వివరిస్తూ ఆటోల ద్వారా విస్తృత ప్రచారం జరుగుతోందన్నారు. పట్టణంలో పందుల సంచారం, పెంపకం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా రాజశేఖర్



ప్రమాణ స్వీకారం చేస్తున్న జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా అమలాపురానికి చెందిన ర్యాలీ రాజశేఖర్, ఆవుపాటి వేణుగోపాల్ ఎన్నికయ్యారు. రావులపాలెంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో ఆదివారం జరిగిన జిల్లా సంఘం సమావేశం జిల్లాకు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుందని జిల్లా సంఘం నూతన కార్యవర్గ ప్రతినిధులు అమలాపురంలో సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జిల్లా సమావేశానికి రాష్ట్ర సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా నూతన కార్యవర్గం చేత ప్రమాణం స్వీకారం చేయించారని పేర్కొన్నారు. జిల్లా కన్వీనర్‌గా తాళాబత్తుల అప్పలాచార్యులు, ఉపాధ్యక్షుడిగా తాళాబత్తుల లక్ష్మణరావు, కోటిపల్లి కృష్ణమాచారి, కోశాధికారిగా కొసన భీమశంకరం, ప్రచార కార్యదర్శిగా ఒంపోలు పోలరాజు ఎన్నికయ్యారు. జిల్లా గౌరవాధ్యక్షుడు కట్టోజు సన్న్యయ్యదాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు హనుమంతరావును జిల్లా సంఘం తరపున ఘనంగా సత్కరించామని జిల్లా నూతన అధ్యక్షుడు రాజశేఖర్ తెలిపారు. దొంగ బంగారం ఆరోపణలతో స్వర్ణకారులను ఇబ్బందులకు గురి చేస్తున్న 272 జీవోను సరవణ చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

విద్యుత్ చార్జీలు, ఫీడ్ రేట్లు పెరగడంతో ఆక్వాలో సంక్షోభం

అమలాపురం రూరల్: విద్యుత్ చార్జీలు, ఫీడ్ రేట్లు పెరిగియి ఆక్వా రంగం సంక్షోభంలో కూరుకుపోయిన నేపథ్యంలో బీఎంఆర్, హింటర్ గ్రూప్ ప్రవేశపెట్టిన ఆక్వా ఫీడ్ రైతుకు ఎంతో భరోసా కలిగిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, ఆక్వా రైతు నాయకుడు యాళ్ల దొరబాబు అన్నారు. బీఎంఆర్, హింటర్ బయో టెక్నాలజీస్ సంస్థలు సంయుక్తంగా రూపొందించిన వెనామీ నూతన ఆక్వా ఫీడ్‌ను క్షత్రియ కల్యాణ మండపంలో ఆదివారం ఆవిష్కరించారు. దీనిపై ఆక్వా రైతులకు అవగాహన కల్పించారు. హింటర్ కంపెనీ ప్రతినిధి లీబుద్ది హార్ట్, ఎంఆర్ గ్రూపు ఉపాధ్యక్షుడు జ్ఞానమణి మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ఫీడ్‌ల కన్నా బీఎంఆర్ సంస్థ రైతులకు అందుబాటు ఉన్న ధరలకే అందిస్తోందన్నారు. బీజేపీ నాయకులు మోకా సుబ్బారావు, పొత్తూరి రామరాజు, కృష్ణంరాజు, టెక్నికల్ మేనేజర్ సెల్వ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌కు మాతృ వియోగం

ముమ్మిడివరం: గాడిలంక గ్రామ సర్పంచ్ పెద్దిరెడ్డి మునీంద్రరావు మాతృమూర్తి సత్యవతి(92) సోమవారం వృద్ధాప్యంతో మృతి చెందారు. స్వగృహంలో తుది శ్వాస విడిచారు. సత్యవతి మృతికి ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, ఎంపీపీ కోలా గంగాభవానీ, జెడ్పీటీసీ కుడిపూడి శంకరరావు, నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సంతాపం వ్యక్తం చేశారు.

వీరేశ్వరుడిని దర్శించిన సినీనటుడు జేడీ చక్రవర్తి

ఐ.పోలవరం: ప్రముఖ సినీనటుడు జేడీ చక్రవర్తి సోమవారం మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జేడీ చక్రవర్తిని ఆలయ చైర్మన్ పెన్మెత్స వాసురాజు, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రత్యేక దర్శనం అనంతరం స్వామివారి కల్యాణంలో వారు పాల్గొన్నారు. అనంతరం స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రంతో సంత్కరించారు.

నిత్యావసరాల పంపిణీ

అమలాపురం టౌన్: కువైట్ ఎన్నారై గ్రూపు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం, కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ప్రతినిధుల సంయుక్త ఆధ్వర్యంలో దివ్యాంగులకు నిత్యావసర వస్తువులను ఆదివారం అందజేశారు. స్థానిక వంటెద్దువారి వీధిలో జరిగిన ఈ కార్యక్రమంలో దివ్యాంగులకు ఈ సాయం సమకూర్చారు. కువైట్ ఎన్నారై గ్రూపు వ్యవస్థాపకుడు మోకా సువర్ణరాజు, జిల్లా దివ్యాంగుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వంటెద్దు వెంకన్నాయుడు, కోనసీమ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నగభేరి కృష్ణమూర్తి ఆర్థిక సహకారంతో సరుకులు అందజేశారు.

మహాత్మునికి నివాళి

వాడవాడలా వర్ధంతి కార్యక్రమాలు

అమలాపురం టౌన్: జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం పలు చోట్ల నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం, గడియారం స్తంభం సెంటరులో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు, వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి, గడియారం స్తంభం సెంటరులో గాంధీ విగ్రహానికి వారు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దేశ స్వాతంత్ర్యం కోసం గాంధీజీ చేసిన త్యాగాలను వారు స్మరించుకున్నారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, మున్సిపల్ కౌన్సిలర్లు కట్టోజు సన్నయ్యదాసు, దొమ్మేటి రాము, మున్సిపల్ ఏఈ హేమంత్ కమల్, వైఎస్సార్ సీపీ నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైశ్య సంఘం ఆధ్వర్యంలో..

పట్టణ వైశ్య సంఘం ఆధ్వర్యంలో కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపం, గడియారం స్తంభం సెంటరులో గల గాంధీ విగ్రహాల వద్ద వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. సంఘం కార్యదర్శి నంబూరి సత్యనారాయణమూర్తి, కోశాధికారి తటవర్తి బంగారం, అదనపు కార్యదర్శులు అప్పన వీరన్న, సింగంశెట్టి కుమార్ తదితరులు ఆ రెండు చోటా గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముమ్మిడివరం: స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో జాతి పిత మహాత్మా గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమిషనర్ జి.లోవరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పెయ్యల చిట్టిబాబు, వి.బోసురాజు, బొంతు సత్యశ్రీనివాస్, ఎస్.రామకృష్ణంరాజు, మేనేజర్ పీవీనూకరాజు, జేఎస్ఎన్‌రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లరేవు: స్థానిక గాంధీనగర్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీజీ వర్ధంతి నిర్వహించి, ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా గాంధీజీ గొప్పతనంపై ప్రజా సంఘాల నాయకుడు టేకుమూడి ఈశ్వరరావు తదితరులు మాట్లాడారు. ఉప్పంగల పంచాయతీ కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహానికి సర్పంచ్ శాఖా శంకరుడు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వైద్యశాఖ ఆధ్వర్యంలో స్పర్శ కార్యక్రమం నిర్వహించి కుష్టి వ్యాధిపై అవాహన ప్రతిజ్ఞ చేశారు. తాళ్లరేవు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉంగరాల వెంకటేశ్వరరావు, అత్తిలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని పలు గ్రామ పంచాయతీల్లో ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను జరిపారు. ఎస్.కొత్తపల్లి, విలసవిల్లి, భీమనపల్లి పంచాయతీ కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి సర్పంచ్‌లు నివాళులర్పించారు. అనంతరం గ్రామాల్లో కుష్టు వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ సర్పంచులు కుంచే చిట్టికుమారి, సలాది ఊర్మిళాదేవి, పెయ్యిల రాజ్‌కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

యానాం: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతిని సోమవారం యానాంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బొటానికల్ గార్డెన్స్‌లో గాంధీ మహాత్ముని నిలువెత్తు కాంస్య విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఫెర్రీరోడ్డు, పాతమార్కెట్ ఎదురుగా ఉన్న పార్కులలో ఉన్న గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఖాదీనూలు వడికే కేంద్రం వద్ద గాంధీ చిత్రపటానికి మహిళలు నివాళులర్పించారు.



గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న చైర్మన్ కమిడి తదితరులు



అమలాపురం మున్సిపల్ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్



బొటానికల్ గార్డెన్స్‌లో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్ఏఓ మునిస్వామి, అధికారులు

విద్యా ప్రణాళికలు అమలు చేయాలి



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రవిసాగర్

అమలాపురం టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా ప్రణాళికలను ప్రధానోపాధ్యాయులు కచ్చితంగా అమలు చేయాలని డీఈవో ఎస్‌వీ రవిసాగర్ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులతో సోమవారం జరిగిన సమీక్షా సమావేశంలో డీఈవో రవిసాగర్ మాట్లాడారు. అమలాపురం ఉప విద్యాశాఖాధికారి పి.షాలోమ్‌రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పాఠశాలల వారీగా అకడమిక్ అంశాలను సమీక్షించి ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఉప విద్యాశాఖాధికారి కార్యాలయంలో అవుట్ పోస్టింగ్ ద్వారా పని చేస్తూ ఇటీవల మృతి చెందిన జి.పాపారావు కుటుంబానికి డివిజన్‌లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అండగా నిలిచినందుకు డీఈవో వారిని అభినందించారు. వారి సహకారంతో సేకరించిన రూ.4.70 లక్షల నగదును బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసిన ప్రతాలను దివంగత పాపారావు కుటుంబ సభ్యులకు సమావేశంలో డీఈవో, ఉప విద్యాశాఖాధికారి అందజేశారు. జిల్లా కామన్ ఎగ్జామ్స్ బోర్డు (డీసీఈబీ) కార్యదర్శి బి.హనుమంతరావు, సర్వశిక్షా అభియాన్ సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయ సంఘం డివిజన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.